# జీసస్, నన్ను క్షమించు

జ్యోతిర్మయి

వీధి తలుపు దగ్గరగా వేసి లోపలికి వచ్చి విడివిడిగా పారేసిన సామానంతా సర్దుతోంది మాలతి. 'తర్వాత వచ్చి తీరిగ్గా చూడగూడదూ. ఆ 5 నిమిషాలలో నే అన్నీ పీకేసి వెళ్ళిపోయారు. వచ్చాక మళ్ళీ ఎలాగూ బజారు కెడతారు.' అనుకుంటూ.

'అవలా ఉంచేద్దూ. తొందరేముంది? నెమ్మదిగా పెట్టుకోవచ్చు.' అన్నారు లక్ష్మీకాంతంగారు.

'అలా పడి ఉంటే ఎలా మరీ? కాస్త పక్కకి పెట్టి వెళ్ళి బియ్యం పడేస్తాను.'

'నా భోజనానికేం తొందర లేదు. ఇంకో కప్పు కాఫీ పెట్టు ఈలోపల. ఇంటి కాఫీ తాగి ఎన్నాళ్ళయిందో? చాలా బాగా కలిపావు ఇందాక.'



ఆ మాట వింటూనె నవ్వింది మాలతి.

'ఇంకో రెండు రోజులుండండి. ఇదే కాఫీకి ఎన్ని వంకలో ఇలాగుందేమిటి అంటూ, ఇన్నాళ్ళయినా కాఫీ పెట్టడమే రాదు అంటారు పైగా. చాలా రోజులయింది కాబట్టి బాగున్నట్టుంది. రేపట్నుంచీ మళ్ళీ మామూలే! సామాన్లన్నీ ఒక తీరుగా పెట్టి వంటింట్లోకి వెళ్ళి కాఫీ పెట్టుకొచ్చి కుర్చీలో కూర్చుంటూ,

'ఇప్పుడు తీరిగ్గా చెప్పండి. పిల్లలు బయటికి వెళ్ళే హడావిడి. ఒక్క మాట మాట్లాడనివ్వలేదు. అమ్మాయి బాగుందా?'

'బ్రహ్మాండంగా ఉంది. రెండు రోజులు బలవంతంగా ఆపేశారు ఇద్దరూ. అతను సెలవు కూడా పెట్టుకున్నాడు నా కోసం. మంచివాడు.'

'అమ్మాయి కులాసాగా తిరుగుతోందా?'

'ఆఁ నీ గోల అర్థమయింది. తిన్నగా అడగకూడదు. ఏం హడావుడీ లేదు. ఎందుకింత తొందర. ఏడాది కూడా అవలేదు పెళ్ళయి. హాయిగా ఉండనీ. ఇంటి దగ్గరగా కాలేజీలో పార్ట్‌టైము ఏదో ఖాళీ ఉందట. చేస్తోంది.'

'అదేమిటి? పని మనుషులు సరిగ్గా దొరకరని అంత పని అదే చేసుకుంటోంది. మళ్ళీ ఇదొకటి. రేప్రొద్దున్న ఒంటికి ఏమన్నా వస్తే.'

'బాగుంది. వయసులో ఉన్నవాళ్ళు పని చేసుకోరూ. ఇక్కడ ఉద్యోగం వదిలేసింది. చదువు వృధా అయిపోతోందని నువ్వే బాధ పడ్డావు. చాలా సులభంగా చేసుకుంటుంది. చూశాను గదా. అతను పొద్దున్నే లేచి పోతాడు. అందుకని ఇది లేచి, తెల్లారేసరికి పనులన్నీ పూర్తి చేసుకుంటుంది. ఉదయం అతను ఎలాగూ అన్నం తినడు. రొట్టెలు, కూర చేస్తుంది. దానికి అదే అలవాటయిపోయిందట. రాత్రి తొందరగా భోజనం చేస్తారు. అది బాగానే ఉంది. నువ్వు పూర్కినే గాభరా పడకు.'

'ఆ రొట్టెలు తిని రోజంతా ఎలా ఉంటుందోండీ? నీరసం రాదూ?'

'నయం. రోగం రాదన్నావు కాదు. అక్కడి వాళ్ళు అందరూ బతకడం లేదా? అయినా 'ఆ వాతావరణానికి రొట్టెలే బాగుంటాయి. అన్నం ఇట్టే అరిగిపోయి వెంటనే మళ్ళీ ఆకలేస్తుంది.'

'సరేలెండి. మీరు అన్నిటికి ఇలాగే సమర్థిస్తారు. మీరు తెచ్చిన చీరలు నచ్చాయా?'

'ఆఁ అమ్మకి చూపించండి ముందు, ఈ సారి వచ్చినపుడు తీసుకుంటాను అంది. ఫర్వాలేదు నీకు నచ్చినవి తీసుకోమన్నాను. అతను ఆ వాచీ తీసుకోడానికి చాలా మొహమాట పడ్డాడు నాకేమిటి అంటూ. బలవంతంగా ఇచ్చాను. నవంబరులో గేమ్సు ఉన్నాయి గదా. చూడ్డానికి రమ్మని ఒకటే గోల ఇద్దరూ. కుదరదన్నాను. మోహన్‌ని పంపించమని చెప్పారు.'

'అక్కడికి వెళ్ళి ఆ జనంలో, గోలలో చూసేదేమిటి? టి. వి. లో చూపిస్తారట కదా. ఇంట్లో కూర్చుని హాయిగా చూడచ్చు.'

'అదీ నిజమే. కానీ అక్కడికి వెళ్ళి ప్రత్యక్షంగా చూడ్డంవేరు.'

'సరేలెండి. ఇంతకీ మీ ప్రయాణం ఎలా అయింది? తిండి అదీ సరిగ్గా తిన్నారా? మనిషి కొంచెం చిక్కినట్టున్నారు'.

'ఏమీ తగ్గలేదు. పూర్కినే అంటున్నావు. శుభ్రంగా ఉన్నాను. మా కంపెనీవాళ్ళు అక్కడ మంచి ఏర్పాట్లే చేశారు. మధ్యలో నాలుగు రోజులు మన కమలాకరం ఇంట్లో ఉన్నాను.'

'ఎలా ఉన్నాడు? వాళ్ళ నాన్న మాత్రం చదువు అవగానే అక్కడికి పోయి మా విషయం పట్టించుకోడం మానేశాడు అని గోల.'

'అదంతే ఇంక. ఏమీ వచ్చే సూచనలు కనిపించలేదు. వాళ్ళింక వాడు సాయం చేస్తాడేమో అన్న ఆశ వదులుకుంటే మంచిది.'

'ఏమో అతను మళ్ళీ వస్తారు. మీరేం కబురు తెస్తారో అని.'

'అదే చెప్పాను. ఈ రోజుల్లో కొడుకుల మీద ఆశలు పెట్టుకుని నిరాశ చెందే బదులు ముందే మానుకోడం మంచిది.'

'మీరు స్నానానికి వెళ్తారా? నేను పని చూసుకుంటాను.'

లక్ష్మీకాంతంగారు కంపెనీ పనిమీద మూడు నెలల కోసం ఇంగ్లాండు వెళ్ళి వచ్చారు. కమలాకరం ఆయన మేనత్త మనవడు. చదువు అయి, ఫారిన్ వెళ్ళిపోయి మళ్ళీ ఇటు చూడటం మానేశాడు. అతని తండ్రి వస్తే ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తున్నారు. గబుక్కున ఏదో గుర్తు వచ్చినట్టు మాలతి వెనకాతలే వంటింట్లోకి వచ్చి,

'అన్నట్టు నీకో విషయం చెప్పడం మర్చిపోయాను. అక్కడ నా పని అంతా అయిపోయాక మా కంపెనీ అతను సైట్ సీయింగ్ చెయ్యకుండా ఎలా వెడతారు అంటూ గోల పెట్టాడు. లండనంతా అప్పటికే తిరిగి చూశాను. చిన్నప్పట్నుంచీ చదువుతాము కదా హిస్టరీలో అక్కడంతా తిరుగుతుంటే ఎప్పుడో అవన్నీ చూసినట్లే అనిపిస్తుంది. ఎప్పుడో వదలిపోయిన ఊరికి మళ్ళీ వచ్చినట్లనిపిస్తుంది. మనుష్యులు తెల్లగా ఉంటారే తప్ప, బొంబాయిలో, కలకత్తాలో ఉన్నట్లే ఉంటుంది. మనవాళ్ళు ఎక్కడ పడితే అక్కడే కనిపిస్తారు. అంతా కొత్త అనిపించదు.'

బియ్యం కుక్కర్లో పెడుతూ, 'ఇంతకీ చెప్పవలసిన విషయం ఏమిటి? ఇవన్నీ మీ ఉత్తరాలలో కూడా రాశారు.' అంది నవ్వుతూ మాలతి.

'ఆఁ లండను చూస్తే చాలదు, చుట్టుప్రక్కల అంతా చూడాలంటూ, వాళ్ళనాన్న కంట్రీ సైడ్‌లో ఇల్లు, ఫారమ్‌తో ఉంటున్నాడని అక్కడికి తీసుకెళ్ళాడు. ఆ ముసలాయన ఎంత చురుగ్గా ఉంటాడో తెలుసా? ఆ వయసుకి ఊరంతా తనే అన్నట్టు అందరికీ సాయంగా ఉంటాడు. నన్ను ఎంతో ఆప్యాయంగా చూశాడు. మన దేశం గురించి ఎంత ఆరాగా అడిగాడో? ఆ చుట్టుప్రక్కల అంతా తిప్పి చూపించాడు. ఇంతకీ సంగతేమిటంటే ఎపుడో మిలటరీలో పనిచేస్తూ అన్ని దేశాలు తిరుగుతూ మనదేశం కూడా వచ్చాడట. ఏ వూరో పాడో ఏమీ గుర్తులేదు. ఈ మధ్యనే భార్య పోయిందట. అందుకని ఈ దుఃఖం మర్చిపోడానికి కొడుకు దేశాలు తిరిగి రమ్మంటున్నాడట. రెండు మూడు నెలల్లో

ఇండియా వస్తానన్నాడు. మన ఊరుకి తప్పకుండా రమ్మన్నాను. అతని కొడుకుతో మా కంపెనీకి ఎలాగూ లావాదేవీలు ఉన్నాయి కదా అందుకని వాళ్ళు కూడా అతన్ని ఎంటర్‌టెయిన్ చేస్తారు.'

'మంచి దుఃఖమే. మనవాళ్ళు భార్య పోతే ఆ వయసులో ఏ వరండాలోనో కాళ్ళు జాచుకుని గోడకి జారబడి పోతారు. ఈయన దేశాలు తిరుగుతాడా?'

'అదే తేడా మనకీ వాళ్ళకీ. బతికినన్నాళ్ళు పూర్తిగా బతకడానికే ప్రయత్నిస్తారు. ఇతనికి బాగా దైవభక్తి, అతని దినచర్య చూడాలి. చివరి రోజులు వచ్చేశాయి. మంచి పనులు చేసి నేను చేసిన పాపాలన్నీ కడుక్కోవాలి అంటూ పొద్దున లేచిన దగ్గర్నుంచీ ఏదో ఒక సాయం చేస్తుంటాడు అంధరికీ.'

'ఆ వయసొస్తే చాలామందికి దేవుడి భయం పట్టుకుని భక్తి ఎక్కువయి పోతుందిలెండి.'

'అలాక్కాదు మాలతీ. చాలా గౌరవం కలుగుతుంది అతన్ని చూస్తే.'

'సరే లెండి. ఇంగ్లీషువాడు, అందులో మిలటరీవాడు. ఏవో వెధవ్వేషాలు వేసి ఉంటాడు. అవన్నీ ఇప్పుడు జ్ఞాపకం వస్తుంటాయి.' అని తేల్చి పారేసి, 'మీరు స్నానం చేసి రండి. అన్నం తిందురుగాని' అని ఖంగారు పెట్టింది.

'వచ్చేస్తున్నాను. చారు ఉందా? ఎన్నాళ్ళయిందో తిని.'

'అన్నీ ఉన్నాయి. భోంచేసి కాస్సేపు పడుకుందురుగాని. మళ్ళీ ఆ సుధ మీరు వచ్చారని కాలేజీ నుంచి తొందరగా వచ్చేస్తే, మిమ్మల్ని పడుకోనివ్వదు.'

భోజనం చేసి, 'నిజంగానే అలసటగా ఉందోయ్. పడుకుంటాను.' అని నిద్రపోయారు లక్ష్మీకాంతంగారు.

మాలతి బట్టలు తడిపి పెట్టి, ఆయన తెచ్చిన సామాన్లన్నీ మళ్ళీ చూస్తూ కూర్చుంది. ఏదో ఆలోచిస్తూ. కాలింగ్ బెల్ చప్పుడు విని గబుక్కున లేచింది.

'ఏం చేస్తున్నారు? పడుకున్నారా?' అంటూ వచ్చింది కామాక్షి.

'లేదండీ. ఇదిగో ఇవాళ పొద్దునే ఈయన వచ్చారు. ఇప్పుడే భోజనం చేసి పడుకున్నారు. సామాన్లు సర్దుతున్నాను. కూర్చోండి.'

'అలాగా. బాగా అయిందా ట్రిప్పు.'

'ఆఁ ఢిల్లీలో సరళని చూసి వచ్చారట.'

'కులాసాగా ఉందా? ఏమన్నా విశేషమా?'

'ఏమీ లేదట. ఉద్యోగం చేస్తోంది కాలేజీలో.

'పోనీలెండి. కాలక్షేపంగా ఉంటుంది. మరీ ఏడాది తిరక్కుండా పిల్లల తల్లులయిపోతే వికాశలెద్దురూ. ఒక సరదా పాడూ ఉండదు. రేపు సాయంత్రం మా నిర్మలకి గాజులు పెట్టిస్తున్నాను. వాళ్ళ అత్తవారింట్లో ఆనవాయితీ లేదట. అక్కడ ఏమీ చెయ్యలేదు. మా యింట్లో ఉంది గదా పోనీ అని సరదాగా పేరంటం చేస్తున్నాను, కొంచెం తొందరగా రండి'.

'తప్పకుండాను. తేలిగ్గాతిరుగుతోందా?'

'ఆఁ బాగానే ఉంది. డాక్టరుకి చూపించాను. వస్తానింక. మీ సరళ ఉద్యోగం చేస్తోందని చెప్తే ఇంతెత్తు లేస్తుంది. నాకప్పుడే కడుపంటూ. వాళ్ళ వాళ్ళకి అసలు ఇష్టంలేదు ఉద్యోగం అవీను.'

'పోనీలెద్దురూ. కావాలనుకుంటే వస్తారా పిల్లలు. అలా అనుకోవద్దనండి. కాఫీ తీసుకుని వెళుదురు



గాని ఉండండి.'

'వద్దండి. ఇందాకే భోజనం అయింది. తప్పకుండా రండి.' అంటూ వెళ్ళిపోయింది. ఆవిడ.

ఆవిడ్ని సాగనంపి లోపలికి రాగానే గదిలోంచి 'ఎవరోయ్' అంటూ అడిగారు లక్ష్మికాంతంగారు నిద్రలోంచే

మన సరళ ఫ్రెండ్ నిర్మల లేదూ, వాళ్ళ అమ్మగారు. ఇద్దరికీ ఒక్కసారే పెళ్ళయింది. ఏదో నెల గాజులు పెట్టిస్తారట. పేరంటం పిలవడానికి వచ్చారు. అందుకే అన్నాను దీనికేమి విశేషం లేదా అని.'

'బాగుందోయ్! దీన్లో పోటీ ఏమిటి? ఎవరికో వచ్చిందని అందరికీ రావాలంటే ఎలాగ? ఖంగారు పడిపోతావు పూర్కినే. అయినా మనం అమ్మమ్మ తాత అయిపోతే అదోలా ఉంటుంది. ముసలాళ్ళమయి పోయినట్టు.'

'బాగుంది. ఇప్పుడు అవలేదేమిటి''

'ఎక్కడ? నా వయసు చెపితే ఎవరూ నమ్మరు.'

నిజమే. తమ ఇద్దరికీ కూడా వయసు తెలియదు. పిల్లలు లేటుగా పుట్టడం వల్ల కూడా అంత వయసుందనుకోరు. అయినా ఆయన రోజులు గడిచిపోయే కొద్దీ మర్చిపోయారు కానీ ఆ పిల్లల కోసం ఎంత ఆరాటపడ్డామో తను మర్చిపోగలదా?

'అదిగో అలా పెట్టకు మొహం. అంత ఖంగారయితే ఎలాగ? ఎవరయినా వింటే నవ్వుతారు.' అంటూ అటు తిరిగి పడుకోబోయిన మనిషి గబుక్కున ఏదో గుర్తు వచ్చినట్టు 'అన్నట్టు మీ అక్కయ్యకెలా ఉంది ఒంట్లో?- అడగడమే మర్చిపోయాను. పూర్తిగా కులాసా చిక్కిందా?' అన్నారు.

'ఆఁ కోలుకుంది. ఇంక యూనివర్సిటీకి వెళ్ళదట. మానేసింది.'

'మంచి పని చేశారు. ఇంక రెస్టు తీసుకోవాలి. లేకపోతే స్ట్రెయిన్ అయిపోతారు.'

'అందుకనేమీ కాదులెండి. వచ్చే నెలలో ఢిల్లీలో ఏదో సింపోసియమ్ ఉందిట. అక్కడ ఏదో పేపర్ చదవాలట. అది తయారుచేసుకుంటోంది. మరి ఆరోగ్యం పాడవుతే వెళ్ళడానికి వీలవదేమోనని ఇంట్లో ఉంది'.

'మంచి ఇంటరెస్టే. మీ అక్కయ్యకీ; అన్నయ్యలకి కూడా విపరీతమైన ఆసక్తయం ఇలాంటివంటే. ఆ రోజుల్లో మీ నాన్నగారు అంతలా చదివించారు ఆవిడనీ మగ పిల్లలతో పాటు. నీకే శ్రద్ధ లేకుండా పోయింది. గానీ నిన్నూ చదివించివారు. నువ్వూ మా అమ్మ కోడలివి అయిపోయావు ...' అని ఇంకా ఏదో అనబోయేంతలో 'నిద్రపోతానన్నారు. ఇదేనేమిటి? కబుర్లతోనే సరిపోతోంది' అని అద్దుకుంది మాలతి.

'నిజమే. టైమెంతయింది? నాలుగుకల్లా లేపించు. ఒక్కసారి ఆఫీసుకి వెళ్ళి వస్తాను. నువ్వూ కాస్సేపు పడుకోరాదూ.

'ఏదీ. పని పిల్ల రావాలి. మీ బట్టలన్నీ తడిపి పెట్టాను. వచ్చి ఉతుకుతానంది. నాలుగు గంటలకి

# ఉగాది

వరకట్నపు "గాలి గంగ"  
భరతం పడుతూ -  
  రాజకీయ విషనాగుల  
  పడగలు పడద్రొక్కుతూ-  
కులమతాగ్ని కీలలపై  
  కుంభవృష్టి కురిపిస్తూ -  
  అధికార మోహదాహానికి  
  అంతిమ గీతం పాడుతూ-  
చీకటి బ్రతుకుల ముంగిట్లో  
చిరుదివ్వెలు వెలిగిస్తూ -  
  అవనికి ఆమని తెస్తే "ఉగాది"  
  అది సమతా సౌధపు పునాది!!-

– చింతలపాటి పూర్ణచంద్రరావు

## జీసస్, నన్ను క్షమించు

లేపిస్తాలెండి' అంటూ తలుపు దగ్గరగా వేసి ఇవతలికి వచ్చింది.

మూడు నెలల తర్వాత ఆయన తిరిగివచ్చారు. పొద్దుట్నించీ సరదాగా ఉంది కబుర్లతో. అలాంటిది సడన్‌గా మనసంతా చికాకయిపోయింది. ఏమి చెయ్యాలనిపించలేదు. అన్నీ అలా వదిలేసి సోఫాలో తలగడ పడేసుకుని నడుం వాల్చింది.

ఈ రోజు ఇది రెండోసారి తన మనసు గాయపడడం. నిద్ర రావడంలేదు. ఏవేవో ఆలోచనలు.

'నిజమే. అక్కయ్య, అన్నయ్యలు వాళ్ళ వాళ్ళ రంగాలలో చాలా పేరు సంపాదించుకున్నారు. ఆ రోజుల్లో నాన్నగారు బ్రిటిష్ ప్రభుత్వంలో చాలా పెద్ద ఉద్యోగం చేసేవారు. అలాగని మళ్ళీ తన స్నేహితులు కొంతమంది స్వాతంత్ర ఉద్యమంలోకి వెళ్ళిపోతే వాళ్ళ పిల్లల్ని చదివించడానికి సాయం చేస్తూ ఉండేవారు. ఆడపిల్లలనీ, మగపిల్లలనీ కూడా సమానంగా చదివించాలని ఆయన ఆశ. అక్కయ్య అప్పటికే ఎమ్. ఎ. లో చేరింది. తను స్కూలులో చదువుతుండేది. నాన్నగారికి తనంటే చాలా ముద్దు ఆఖరిదని. పోలికలు కూడా ఆయనవే. పెద్ద కళ్ళు, తెల్లటి రంగు, మంచి మంచి బట్టలు వేసుకునేది. 'మా అమ్మ డాక్టరయిపోతుంది. పెద్దదయితే నాకు బెంగలేదు' అని తెగ మురిసి పోయేవారు. ఆడపిల్లల కోసమని తెరిచిన మిషనరీ స్కూలులో చదివేది. మంచి మార్కులు వచ్చేవి. చాలామంది ఫాషన్ కోసం చదివేవారు. తను మాత్రం చాలా శ్రద్ధగా చదివేది. అమ్మకి మాత్రం ఇవేవీ ఇష్టం ఉండేదికాదు. అక్కయ్య, అన్నయ్య మద్రాసులో చదివేవారు. వాళ్ళ చదువుఅయ్యేదాకా ఇల్లు తీసుకుని అక్కడ ఉండమన్నారు అమ్మని. తనని కూడా అక్కడే చేర్పిస్తానని. అమ్మ ఒప్పుకోలేదు. అలాగయినా అక్కయ్య చదువు మానేస్తారని. నాన్నగారు అంతకన్నా ఊరుకోలేదు. తెలిసిన వాళ్ళ ఇంట్లో గదులు తీసుకుని అన్ని ఏర్పాట్లు చేసి మరి చదివించేవారు. చిన్నన్నయ్య బెనారస్‌లో చదువుతూ ఉండేవాడు. ఆ రోజుల్లో ఇంట్లో కూడా తనతో ఇంగ్లీషులో మాట్లాడుతూ ఉంటే, అమ్మకు చికాకు వేసేది. భోజనాలు చేస్తూ తను, నాన్నగారు ఇంగ్లీషులో ఏవో కబుర్లు చెప్పుకుంటూంటే అమ్మ ఆముదం తాగినట్లు వెగటుగా మొహం పెట్టేది. రోజులు ఎంతో సరదాగా గడిచిపోతుండేవి.

అలాంటిది అనుకోని చిన్న సంఘటనతో జీవితం అంతా మారిపోయింది. దానికి కారణమైన వ్యక్తి మొగం కూడా గుర్తు లేదు తనకి. అసలు తలుచుకుంటే నిజంగా అలా జరిగిందా? జరిగితే ఎందుకు అలా జరగాలి? అన్న ఆవేశం వస్తుంది. తన చదువు డాక్టరు కావాలన్న కలలు - అన్నీ కాలక్రమాన మర్చిపోయినా ఆ సమయంలో మాత్రం నిలువుగా కూలిపోతుంటే దుఃఖం ఆగేది కాదు. నాన్నగారికి వేరే దారి లేకపోయింది. సమాజాన్ని ఎదిరించి ఆ రోజుల్లో ధైర్యంగా ఆడపిల్లలని చదివించగలననుకున్నారు గానీ, మొత్తం జీవితానికి మచ్చ తెచ్చే పరిస్థితుల్ని మొండిగా ఎదిరించలేకపోయారు. ఇంకొక చోటికి పంపించి చదివించాలన్న ఆలోచన వచ్చింది గానీ అమ్మ మొండి కేసింది. గోల పెట్టింది. తనూ బెదిరిపోయి ఉందేమో కొత్త చోటకి వెళ్ళి చదువుకునే ధైర్యం కోల్పోయింది. ఎంత తొందరగా తనని ఆ ఊరు నుంచి తప్పిస్తే అంత మంచిదని అమ్మమ్మ దగ్గరకి పంపించేశారు. అసలు విషయం ఎవరికీ తెలియదు అమ్మకి తప్ప. ఎప్పట్నించో అమ్మమ్మ సణుగుతోంది. ఆడపిల్లల్ని చదివించి సంసారం చేసేస్తున్నారని, ఆ కారణమే చెప్పి, 'ఎలాగూ దీనికి చదువు రావడం లేదు. దండగ. మీ మాట ఎందుకు కాదనాలి? పెద్దమ్మాయితో కలిసి సంబంధం దొరికితే దీనికి చేసేస్తాను' అన్నారు నాన్నగారు. ఎంతో తెలివైన తనని చదువు రాని మొద్దు అంటూ చెప్పడానికి ఆయన ఎంత బాధ పడ్డారో తనకి తెలుసు. అమ్మ, నాన్నగారు లేకుండా ఒక్కర్తే అమ్మమ్మ దగ్గర ఉంటూ కొన్ని రోజులు రాత్రుళ్ళు ఏడ్చుకునేది. అలాగే స్తబ్ధుగా గడిపేది. అమ్మమ్మ, తాతగారు మంచి సంబంధం కోసమని ఊళ్ళన్నీ వాకబు చేస్తున్నారు. నాన్నగారయితే 'చదువుకున్న కుర్రవాడు అయితే చాలు. ఆస్తిపాస్తులు చూడకండి. మనకున్నది చాలు' అని చెప్పారు. కానీ వాళ్ళకలా కాదు. డబ్బుండాలి, చదువుండాలి, మంచి కుటుంబం అయి ఉండాలి. ఆ వేటలో ఏడాది గడిచిపోయింది.

తనకి మాత్రం వేరే లోకంలోకి వచ్చినట్టు ఉండేది. స్కూలు, చదువు, ఫ్రెండ్స్, పార్టీలు ఇవేవీ లేవు. పల్లెటూరు, పాడి, పంట, పొలాలు, వ్రతాలు, నోములు, పేరంటాలు - ఈ లోకంలో పడ్డాను. ఒకరోజు అమ్మమ్మతో పక్క ఊరు పెళ్ళికి వెళ్ళింది

బండిలో. చాలా గొప్పవాళ్ళు. తాతగారికి స్నేహితులు, చుట్టాలు కూడాను. మనవరాలినంటూ అందరికి గొప్పగా చూపించింది అమ్మమ్మ. ఈ ఏడాదిలో అలాంటివన్నీ అలవాటయిపోయాయి. అందరూ తననే చూసేవారు. అడుగు వెడల్పు జరీ పట్టు పరికిణీ, సిల్కు ఓణీ, నగలు వీటికి తోడు అందం.

మాటలతో మగపెళ్ళి వారి తరఫు వాళ్ళతో కూడా అమ్మమ్మ కబుర్లు కలిపి, చుట్టరికాలు తేల్చేసింది. వాళ్ళలో తన అత్తగారు కూడా ఒకరు. ఒకప్పుడు చాలా ఆస్తిపాస్తులు ఉండేవిట. పరిస్థితులు కలిసిరాక చితికిపోయారు. చాలా పేరున్న కుటుంబం. ఎవరి సాయాన్ని అర్థించకుండా తమంతట తమే పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. తమ ఆఖరి అబ్బాయి బెనారస్‌లో ఇంజనీరింగ్ చదువుకున్నాడని, మీ మనవరాల్ని ఇమ్మన్నట్టుగా అడిగారు.

మగపిల్లలందరు చదువుకుని వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడగలిగే స్థితికి వచ్చారు. ఆస్తిపాస్తులు పోయాయన్న బెంగ లేదు మాకు. దేవుడి దయ వల్ల తేరుకున్నాం.' అన్నారు అమ్మమ్మ.

'మా అల్లుడికి రాస్తాను. వాళ్ళు వస్తే మిమ్మల్ని కలుస్తాము' అని చెప్పింది.

తిరిగి వస్తుంటే, 'ఒకప్పుడు వాళ్ళెంత మోతుబరులనుకున్నావు? అప్పట్లో వాళ్ళ ఇంటికి వెళ్ళడమే గొప్ప. అలాంటి వాళ్ళు ఇలా అయిపోయారు. అయితేనేం ఆవిడ మొహంలో ఠీవి, కళ చూశావా? ఎక్కడికి పోతాయి? ఇపుడు వాళ్ళంతట వాళ్ళు అడుగుతున్నారు కాబట్టి ఇలా ఆలోచిస్తున్నాం కానీ, ఆ రోజుల్లో అయితే చేసుకునా చేసుకోకపోయినా అడిగితే చాలు అదే గొప్ప. సరే – మీ నాన్నకి కూడా నచ్చుతుంది ఈ సంబంధం' అంటూ అమ్మమ్మ సంబరపడింది.

ఆ తర్వాత చాలా తొందరగా జరిగిపోయాయి. అన్నీ. వాళ్ళ అమ్మ చూస్తే చాలని, తను చూడకుండానే చేసుకున్నారు. తన జీవితంలో అనుకోకుండా వచ్చిన అదృష్టం ఏదన్నా ఉంటే అది ఆయనే. నాన్నగారు చాలా బ్రహ్మాండంగా పెళ్ళి చేశారు. అక్కయ్యకి ముందు అనుకున్న ప్రకారం బావతో పెళ్ళయింది. రెండూ ఒక్కసారే చేశారు. ఆయన చదువు పూర్తయే దాకా, అత్తగారి దగ్గరా, అమ్మమ్మ దగ్గరా ఉంటూ ఉండేది. ఇద్దరూ నోములని, వ్రతాలని తమ సరదాలన్నీ తీర్చుకునేవారు.

'పెళ్ళికి ముందు నన్ను చూడాలని అనిపించ లేదా' అని ఆ తర్వాత ఆయన్ని అడిగితే ఎంతో అందంగా సమాధానం చెప్పారు.

'మా అమ్మ నీ అందం గురించి ఎంతగా వర్ణించిందంటే, మళ్ళీ చూస్తానని నీ అందాన్ని చిన్నబుచ్చడం నాకిష్టం లేకపోయింది. ఎలాగూ పెళ్ళయ్యాక నేనే కదా చూసేది.'

తన చదువు ఆగిపోయింది. అనుకున్నట్లుగా ఏమీ జరగలేదు అన్న బాధ ఆయన సాహచర్యంలో తొందరగా మర్చిపోయింది. చదువయిపోయాక మంచి ఉద్యోగం రావడానికి నాన్నగారు సాయం చేశారు. చాలా మొహమాట పడ్డారు ఆయన. అల్లుడి మర్యాదలు చేస్తేనే ఆయన ముడుచుకు పోయేవారు. అలాంటిది నాన్నగారి పలుకుబడితో ఉద్యోగం అంటే మొదట ఒప్పుకోలేదు. నాన్నగారే నచ్చ చెప్పారు. 'నా కొడుకొకటీ నువ్వొకటీ కాదు. అర్హత ఉన్న వాడివి సాయం చేస్తే తప్పేముంది? ఇంకొన్ని రోజు లాగితే ఎలాగూ వస్తుంది. నా వల్ల కొంచెం ముందుగా దొరుకుతుంది. అంతే కదా. అంటూ.

అన్నీ సరిగా జరిగిపోతున్నా అందరికీ ఒకటే చింత. పెళ్ళయి ఎన్నేళ్ళయినా తనకి పిల్లలు లేరు. మిగతా అందరికీ ముగ్గురు, నలుగురు కూడాను. మొదట్లో అంతగా అనిపించక పోయినా రోజులు గడుస్తున్న కొద్దీ ఆయనకి దిగులు పట్టుకుని అప్పుడప్పుడు తేలిపోయేవారు. అత్తగారయితే తన గురించి బెంగపెట్టుకున్నారు. ఆఖరి సంతానం అవడంతో తనలాగే ఆవిడకి ఆయనంటే కొంచెం ఎక్కువ ప్రేమ. ఒకటి రెండుసార్లు ఈ బాధంతా భరించలేక ఆయన్ని మళ్ళీ పెళ్ళి చేసుకోమని కూడా అంది. 'కష్టమైనా, నిష్ఠూరమైనా ఇద్దరమూ కలిసే అనుభవిద్దాము. అంతేకానీ నిన్నెందుకు


తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారంకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివారాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టుకు డై వెయ్యవలసిన లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడుకు చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (AP)**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***

వివాహాది శుభకార్యములకు
అసలు వెండి జరీతో తయారైన
**కంచి పట్టు**
చీరెల
ప్రత్యేక షోరూమ్!

నేడే
దర్శించండి!



**కంచి కరుణానిధి పట్టు చేనేత కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ No.K.H.4**
• H.O. గాంధీ రోడ్, కంచి
• సేల్స్ బ్రాంచి: అరండల్‌పేట మసీదు ఎదురు వీధి, విజయవాడ-2

చిన్నబుచ్చుకుంటావు అనవసరంగా' అని ఎంతో అనునయించేవారు. తనవల్ల ఆయన కూడా జీవితంలో ఎంతో పోగొట్టుకుంటున్నారు. మౌనంగా తనలో తనే బాధపడుతుంటే మరింత క్రుంగిపోయింది. నాన్నగారు, అమ్మ కూడా ఏడాది తేడాతో, తనకి పిల్లలు లేరనే బాధతోనే పోయారు. ఇవన్నీ కలిసి తన మీద చాలా దెబ్బతీశాయి. అక్క, అన్నలు చాలా అభిమానంగా చూసేవారు కానీ ఈ విషయంలో ఎలా ఓదార్చాలో వాళ్ళకి తెలిసేదికాదు. ఇలా ఎందుకు జరుగుతోంది? తను అనుకున్నవి ఏవీ ఎందుకు జరగవు? అందరిలాంటి అదృష్టం కాదా తనది? అంతటికీ ఆ ఊరు పేరు తెలియని వ్యక్తే కారణం అని ఎన్నో తిట్టుకునేది.

పెళ్ళయిన పదకొండు ఏళ్ళకి, అన్ని ఆశలు వదులుకున్నాక, నెల తప్పింది తను. భూమికి అడుగు ఎత్తులో నడిచింది తను సంతోషంతో. మోహన్ పుట్టాడు. ఆ మాట విన్నాకే, మనవడ్ని ఎతుకున్నాకే అత్తగారు కొన్ని రోజులకి పోయారు. ఆఖరి రోజుల్లో ఆవిడకి ఆ తృప్తి కలిగిందని తలుచుకుంటే ఇప్పటికి సంతోషంగా ఉంటుంది, ఆ తర్వాత మాటల్లో–

'ఇన్నాళ్ళు పిల్లలు లేకుండా ఎలా గడిపానో, నాలాంటి ఉపయోగంలేని మనిషిని చేసుకుని మీరు కూడా నాతోపాటు చేయని పాపానికి శిక్ష అనుభవించారు.' అని తను అంటే ఆయన గబుక్కున తన నోరు మూశారు.

## ఉగాది....!

రేపటి ఉగాది కని  
నేడు వేపపువ్వుకొంటుంటే  
అనిపించింది నాకు,  
భవన నిర్మాణంలోనే కాదు–  
భగవంతుడికి పెట్టే నైవేద్యంలో కూడా  
పేదవాడి పాత్ర వుందని.

– మధుశ్రీ

## జీసస్, నన్ను క్షమించు

'నేను చాలా దుర్మార్గుడ్ని మాలతీ. చేయని పాపానికి శిక్ష అనుభవించింది నువ్వు. అందరూ గొడ్రాలంటే పడ్డది నువ్వే'. అని చాలా బాధగా అన్నారు. తనకేమి అర్థం కాలేదు. వెర్రిదానిలా చూసింది.

'నిజం మాలతీ. కొన్నాళ్ల కిందట నా స్నేహితుడొకడు డాక్టరు కలిశాడు. మాటల్లో పిల్లలెంతమంది అంటే లేరని చెప్పాను. పెళ్ళయి ఎన్నాళ్లయిందని చెపితే. ఎందుకయినా మంచిది నువ్వు 'టెస్ట్ చేయించుకో' అంటూ పరీక్షించాడు. లోపం నాలోనే ఉంది మాలతీ. ఏం ఫర్వాలేదు మందులు వేసుకోమని, తనే ఏడాదిపాటు ట్రీట్ చేశాడు. ఇదంతా నీకు తెలియకుండా చేశాను. ఒకవేళ ఈ లోపం సరికాకపోతె, దానికి నువ్వు బాధ్యత వహిస్తుంటే ఎలా తట్టుకోవాలో నాకర్థంకాలేదు. నీకు ఎలా చెప్పాలో కూడా అర్థంకాలేదు. విషయం తెలిశాక నీ నుంచి దాచిపెట్టి నిన్ను మోసం చెయ్యడం నాకు చేతకాదు. చాలా మథనపడ్డాను. చివరికి అంతా సరిగానే ఉంది, ఎందుకు పుట్టరో చూస్తాను అని అన్నాడు గానీ నాకు నమ్మకంలేదు. చివరికి నువ్వు ఆ వార్త చెప్పేదాకా ముళ్ళమీద గడిపాను తెలుసా?' అంటూ తన ఒళ్ళో తలదాచుకున్నారు. తన మనసు ఆర్ద్రమయింది.

అప్పటికిగానీ కొన్నాళ్ళుగా ఆయన ఎందుకలా మౌనంగా అసహనంగా ఉంటున్నారో అర్థంకాలేదు. తన పరిస్థితి అలాగే ఉండటంతో గట్టిగా అడిగే ధైర్యం ఉండేదికాదు. తెలిసిన కారణమే గదా. దేవుడు పూర్తిగా నిర్దయుడు కాదు. తను కోరుకున్నవి కొన్ని జరగకపోయినా, అనుకోనివి కొన్ని ఇచ్చాడు.

'నాకన్నా మీరే ఎక్కువ బాధపడ్డారండీ. ఏ భర్తా భార్య దగ్గర తనదే లోపం అని ఒప్పుకోలేదు. మాకయితే తరతరాల నుంచి అలవాటే పిల్లలు పుట్టడానికి బాధ్యత మాదే అని. పుట్టకపోతే లోపం మాదే అనుకుంటాం. కానీ మీరిలా నా దగ్గర ఒప్పుకోడం నాకెంతో సంతోషంగా ఉంద. ఒకవేళ ఇలా సవ్యంగా జరక్కపోయినా మీరన్నాళ్లో నా దగ్గర నుంచి ఈ రహస్యం దాచలేరు. అంది తృప్తిగా, అటువంటి వ్యక్తి తన భర్త అంటే ఎంతో గర్వంగా



ఉంటుంది ఇప్పటికీ.


అటునుంచి ఇటు ఒత్తిగిలింది మాలతి. టైము చూసుకుని, "పని పిల్ల ఇంకా రాలేదు" అనుకుంటూ మళ్ళీ ఆలోచనలో పడింది. తర్వాత సరళ, సుధ పుట్టారు. వాళ్ళ పెంపకంలో ఇంక తీరిక అంటూ లేకుండా జీవితం హాయిగా గడిచిపోయింది. ఆయన కూడా ఉద్యోగంలో చాలా పైకి వచ్చారు. నెమ్మదిగా నచ్చ చెప్పి, నాన్నగారు తనకి ఇచ్చిన డబ్బు కూడా కలిపి ఒక ఇల్లు కట్టించింది. పిల్లలు పెద్దవాళ్ళయి ఇపుడు మరి తోచకుండా ఉంది. ఎవరంతట వాళ్ళు అయిపోయారు. సరళ పెళ్ళయి వెళ్ళిపోయింది. అబ్బాయి సి.ఎ. పాసయి ప్రాక్టీసు చేస్తున్నాడు. సుధ మెడిసిన్ చదువుతోంది. తను చదువుకోలేకపోయినా తన కోరికలన్నీ పిల్లలతో తీర్చుకుంది. సుధ కోటు వేసుకుని, స్టెత్ తీసుకుని, వెడుతుంటే దాన్లో తనని చూసుకుంటుంది. కాలేజీలో జరిగినవన్నీ పూసగుచ్చినట్లు తనతో చెప్పటం దానికొక అలవాటు. అవన్నీ వింటుంటే ఎంతో హాయిగా ఉంటుంది తనకి. ఎపుడన్నా మాటల్లో వీళ్ళవరన్నా,

"దొడ్డమ్మ, మామయ్యల లాగా నువ్వు కూడా చదువుకుంటే ఎంత బాగుండేదమ్మా. వాళ్ళు ముగ్గురూ చదువు కున్నారు. నీకే రాలేదు." అంటే మాత్రం మనసు చివుక్కు మంటుంది. ఈ మధ్య తీరిక ఎక్కువయిపోయి ఇలా పాత రోజులు గుర్తు చేసుకుంటూ ఎందుకూ ఉపయోగం లేని మనస్తాపం పడటం అలవాటయి పోతోంది. ఎలా ఆపుకోవాలో అర్థం కావడం లేదు.

బెల్ చప్పుడయి గబుక్కున లేచింది. పని పిల్ల వచ్చింది. "ఏమే ఇంత ఆలస్యం అయింది? ఇప్పుడు ఆరేస్తే బట్టలు ఎప్పుడు ఆరతాయి?"

"ఏదమ్మా, ఎప్పుడో వద్దామనుకున్నాను. ఆ రామలక్ష్మమ్మగారు చపాతీలు చేసుకోవాలిట రాత్రికి. అప్పటికప్పుడు గోధుమలు బాగుచేసి మిల్లు పట్టించుకు రమ్మన్నారు. కదల నివ్వలేదు. ఈ పొద్దయింది. గబుక్కున గట్టిగా పిండి ఆరేస్తాను" అంటూ లోపలికి పరుగెత్తింది. "నాలుగు అవుతోంది. కాఫీ కలిపి ఆయన్ని లేపాలి" అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది మాలతి.

మనసు మాత్రం మళ్ళీ కోతిలా ఆలోచనలు చేస్తోంది. "సరళ తోటి పిల్లలందరు అపుడే తల్లు లయిపోతున్నారు. దానికేమి లేదంటే తనకి ఏదో భయం. ఎందుకింత ఖంగారు అంటారుగానీ ఆయనకి తెలియదా తామెంత బాధపడ్తారో. ఈయన కాబట్టి ధైర్యంగా పరీక్ష చేయించు కున్నారు గానీ అందరూ అలా ముందుకు వస్తారా? దాన్లో లోపమో, అతనిదో తెలియద్దూ. అతనిదే అయితే పరీక్ష చేయించుకోడానికి ఒప్పుకుంటాడో లేదో? ఎంత మంచి వాళ్ళయినా ఇలాంటి విషయాల్లో వెనక్కి పోతారు, తప్పంతా ఆడవాళ్ళ మీదకి తోసి. ఏడాది లోపల నెల తప్పకపోతే ఈ రోజుల్లో ఏదో అనుమానమే. ఇపుడే ఎందుకని



పంచాంగ శ్రవణం
చిత్రకారుడు : దేవు దీక్షితులు

జాగ్రత్త పడుతున్నారో ఏమిటో? అలాంటివి చేస్తే తీరా కావాలను కున్నప్పుడు ఏవో కాంప్లికేషన్స్ వస్తాయి. అపుడు గోల పెడ్తారు. ఈసారి వస్తే అడగాలి. ఉత్తరంలో రాయాలంటే అతను చదువుతాడేమోనని ఊర్కుంది. ఏమీ లేకపోతే ఆ డి ఎండ్ సి అన్నా చేయించాలి. కానీ తన పోలిక మాత్రం రాకూడదు. అంతగా పెంచడం కష్టం అంటే చంటిపిల్లని తన దగ్గర ఉంచుకుంటుంది. మూడేళ్ళ దాకా అంతేగానీ ఈ సస్పెన్స్ తను భరించలేదు. అలా ఆరాటపడి పోతోంది మాలతిలోని తల్లి మనసు. గదిలోకి వెళ్ళి ఆయన్ని లేపించింది.

పనిపిల్లని "ఆ పనలా ఉంచి కాస్త ఈ కాఫీ తాగు. ఎప్పుడనగా తిండి తిన్నావో ఏమిటో?" అంటూ కేకేసింది. అది కాఫీ తాగుతుంటే.

"వెళ్ళే ముందు అన్నం కొంచెం ఇక్కడ తిని మరీ పట్టుకెళ్ళు. ఇంటి దగ్గర మీ వాళ్ళందరూ తిన్నాక మిగిలిందేమన్నా తింటే ఇదీ అదీ కలిపి మళ్ళీ రేపు పని చేయడానికి ఓపిక వస్తుంది. మీ అమ్మ పని చేస్తుంది గానీ తిండి గోల చూడదు." అంది.

"ఏం చేస్తుందమ్మా. అందరూ చిన్న పిల్లలు గదా. నేను ఆకలికి ఆగుతాను గానీ వాళ్ళు ఆగలేరు. వాళ్ళు తినందే నాకూ తినాలని పించదు."

"మంచి ప్రేమే. అయినా నువ్వు పడకొస్తే అసలు రోజు గడిచేదేలా? ఏదో ఒకటి తినాలి గానీ" అంటూ లక్ష్మీకాంతంగారు రావడం చూసి, కాఫీ ఇచ్చింది.

"జంతికలు చేశాను తింటారా?" అంది.

"ఇయ్యి. ఒక వారం రోజులదాకా నువ్వేమిచ్చినా కాదనను. అన్నింటికీ మొహం వాచిపోయాను." అన్నారు.

# ఇ·వేమన·పద్యాలు




ముప్పి వేపచెట్టు మొదలుగా ప్రజలకు
పరగ మాలికలకు పనికివచ్చు
నిర్దయాత్మకుండు నీచుడెందునకును
పనికిరాడు గదర పరగవేమ

అలా తిరుగు తుంటారు. చూసే వాళ్ళకి బాగుండదు." తనలో తను అనుకున్నట్టుగా అంది.

"ఏం ఫర్వాలేదు తిరగనీ. ఆ సరదా పెళ్ళయ్యాక రాదు. మనకి తెలిసే తిరుగుతున్నారు గదా. వాళ్ల ఇంటికి వెళ్ళావా ఈ మధ్య."

"పుట్టిన రోజంటూ ఒక రోజు భోజనానికి పిల్చింది. పిల్లలు వస్తారు, నేనెందుకు అంటూ మామూలుగా రానన్నాను. వాళ్ల అమ్మగార్ని తీసుకుని వచ్చింది పిలవడానికి. మీరు లేకుండా నేను ఒక్కదాన్ని వెళ్లడం ఏమిటని రానన్నాను అంతే. ఏమిటో అనుకుంది కాబోలు."

"బాగుంది. ఇప్పట్నుంచీ వియ్యపురాలి అలక ప్రాక్టీసు చేస్తున్నా వేమిటి? అయినా నేను లేందే ఎక్కడికీ వెళ్లనంటావు గదా ఎన్నాళ్ళు ఇలా ఇద్దరం కలిసి ఉంటాము చెప్పు. ఎపుడో ఒకపుడు ఒకళ్లమే రెండో వాళ్ళు లేకుండా గడిపే రోజులు వస్తాయి...." ఆ మాటలు వింటుంటేనే మాలతి కళ్ళు నిండుకున్నాయి. మధ్యలో నే, అందుకుని,

"ఎందుకు ఇప్పట్నుంచీ ఆ మాటలు తీరి కూర్చుని. ఆఫీసుకి వెళ్ళాలన్నారు, లేవండి" అని తొందర చేసింది.

"నిజమే. ఆయన లేకుండా తను, తను లేకుండా ఆయన ఉండగలరా? ఊహించుకుంటేనే తట్టుకోలేక పోతోంది. పూర్వకాలపు చిన్నతనం పెళ్ళిళ్లలో ఈ బంధాలు మరీ ఎక్కువ. ఆ వయసులో తమ జీవిత భాగస్వామి ఎలా ఉండాలి అన్న అవగాహన ఉండదు. అందుకని ముడిపడ్డ వ్యక్తే, తన సర్వస్వం అన్న భావన ముఖ్యంగా ఆడవాళ్లలో ఎక్కువగా ఉండేది. అలాంటి వాడయితే బాగుండును, ఇలాంటిదయితే బాగుండేది అని అనుకునే అవకాశమే ఉండేది కాదు. అందుకనే ఒకళ్ళు లేకపోతే ఇంకొకళ్ళు ఏదో బతకాలని బతకడమే తప్ప ఉత్సాహం ఉండదు. పూర్వకాలం విన్నట్టుగా ఆయన పోయాక, బెంగ పెట్టుకుని ఆవిడ పోయింది ఏడాది లోపలే అన్నమాట ఈ రోజుల్లో వినము." ఇలా ఆలోచించుకుంటూ ఏమిటో ఈ రోజు ఒకదాని తర్వాత ఒకటి మనసుని బాధపెట్టే సందర్భాలే వస్తున్నాయి. మనసు బాగులేదు. అనుకుంటూ పిల్లలు వచ్చే టైమయిందని లేని ఉత్సాహం తెచ్చుకుంది.

ఆ రోజు రాత్రి విపరీతమైన చెమటలతో, నోరు ఎండిపోయి, వణుకుతూ లేచి కూర్చుంది మాలతి. ఎంతో నిస్సత్తువుగా అనిపించింది. ఇన్నాళ్లయినా తనకీ భయం పోలేదు. ఆ రోజంతా మనసు బాగు లేకుండా ఉండటం, ఈ కల రావడానికి కారణం అనిపించింది. ఎవరో తరుముతున్నట్టు, పట్టుకుని ఒక పెద్ద పడవమీద తనని తీసుకు పోతున్నట్టు, తను గింజుకోవడం- అలాగే వచ్చింది. ఎవరో ఏమిటి?ఆ మనిషే. లేచి మంచి నీళ్ళు తాగి, "ఈ వయసులో ఇంకా ఇలాంటి కలలు ఏమిటి తనకి?" అనుకుంది

(ముగింపు పై వారం)

"మూడు నెలలకే. ఏళ్ళ తరబడి అక్కడ ఉంటున్న వాళ్ళు ఎలా ఉంటారు మరి?"

"వాళ్ళు ఎలాగా అక్కడే ఉండాలిగదాని గుండె రాయి చేసుకుంటారు. బయట హోటల్స్‌లో దొరుకుతాయి కానీ చాలా ఖరీదు. అయినా ఇప్పుడు అక్కడా అన్నీ దొరుకుతున్నాయి. సంసారం ఉన్నవాళ్ళకి ఏమీ ఇబ్బంది ఉండదు. ఇంట్లో అన్నీ చేసుకోవచ్చు. నాలా కొన్ని రోజులుండి, అక్కడా ఇక్కడా తినే వాళ్లకే ఇబ్బంది. అవునూ, సుధ రాలేదు ఇంకా?"

"ఏవో క్లాసులు ఉండి ఉంటాయి. లేకపోతే ఇంతసేపు ఉంటుందా? పొద్దున అసలు కబుర్లు చెప్పే తీరిక ఏది?"

## జీసస్, నన్ను క్షమించు

"శాంతి ఎలా ఉంది? వచ్చారా ఈ మధ్యన వాళ్ళు?"

"వస్తూనే ఉన్నారు. మీ రొచ్చారని తెలుస్తుంది ఇవాళ సాయింత్రం వస్తారేమో. సుధతో కలిసి శాంతి వచ్చినా వస్తుంది."

శాంతి తమ కాబోయే కోడలు. మోహన్ స్నేహితుడి చెల్లెలు. హౌస్ సర్జన్ చేస్తోంది. ఇద్దరూ నచ్చుకుని చేసుకుంటా మన్నారు. అభ్యంతరం పెట్టవలసిన అవసరమే రాలేదు. వాళ్ల నాన్నగారు పెద్ద సర్జన్.

"తొందరగా పెళ్ళి చేసేస్తే బాగుంటుందేమో.

# జీసస్, నన్ను క్షమించు

'జ్యోతిర్మయి'



(గత సంచిక తరువాయి)

నాలుగు నెలలు గడిచాయి. ఆ రోజు సాయంత్రం లక్ష్మీకాంతంగారు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి, 'ఆ రోజు నీకు చెప్పాను గుర్తుందా? ఇంగ్లాండులో ఒక ముసలాయన మనదేశం వస్తానన్నారని. ఇవాళ ఉత్తరం వచ్చింది. ఆయన కొడుకు దగ్గర్నుంచి. ఇంకో 15 రోజుల్లో వస్తారట. ముందర ఢిల్లీ వెళ్లి కాశీ, అలహాబాదు చూసుకుని ఇక్కడికి వస్తారట. నేను రమ్మన్నాననే మన ఊరు వస్తున్నారు. మనం కాస్త ఊరదీ చూపించాలి. రెండు, మూడు రోజులు ఉంటారు. మా కంపెనీ వాళ్లు కూడా చూసుకుంటారులే. మన ఇల్లు పెద్దది కదా. ఇంట్లో ఉంచుదామంటావా?' అన్నారు గబగబా.

'ఎందుకు లెద్దురూ? వాళ్ల అలవాట్లవీ వేరు. మన వాళ్లా ఏమన్ననా? అతనికీ మొహమాటంగా ఉంటుంది. హోటల్లో ఉంచితే మంచిది. ఒక రోజు ఇంటికి తీసుకు రావచ్చు మధ్యలో.' సరేనని ఒప్పుకున్నారు ఆయన.

ఆ రోజు ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లి అతన్ని రిసీవ్ చేసుకుని, హోటల్లో దింపి వచ్చారు. మోహన్‌తో, కొంచెం తీరిక చూసుకుని మధ్యాహ్నం ఆయన్ని కొంచెం అలా తిప్పి తీసుకురా. నాకు ఆఫీసులో కొంచెం పనుంది. సాయంత్రం నేను చూసుకుంటాను. పగలు రెస్టు తీసుకుంటారు ఆయన.' అన్నారు.

రెండు రోజులు ఆయన వెనకాతలే తిరిగారు, ఇద్దరూ. రెండో రోజు రాత్రి ఇంటికి తీసుకు వచ్చారు. కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పి, కాఫీ మాత్రం తాగారు. ఏమీ తినాలని లేదని. దేశం కాని దేశంలో బలవంతం పెట్టడం ఇష్టం లేక ఊరుకున్నారు. చాలా సౌమ్యంగా మాట్లాడతాడు అతను. 'మై చైల్డ్' అంటూ. మాలతితో కూడా చాలా అభిమానంగా మాట్లాడారు. అందరికీ ఆయనంటే మంచి అభిప్రాయం కలిగింది.

ఆ రాత్రి పదీ గంటలకి ఫోను వచ్చింది, హోటల్ నుంచి. ఫలానా అతనికి మైల్డ్‌గా హార్ట్ ఎటాక్ వచ్చిందని, తను డాక్టర్ చేత పరీక్ష చేయించామని, మీ నెంబరు చెప్పారు, తెలియజెయ్యమని, వెంటనే రమ్మంటూ ఖంగారుగా పరుగెత్తారు లక్ష్మీకాంతంగారు. తన వాళ్లందరికీ దూరంగా ఉన్నారు, ఏమవుతుందో ఏమిటో అనుకుంటూ. గంట సేపటికి ఆయన్ని తీసుకుని ఇంటికి వచ్చారు. శాంతి వాళ్ల నాన్నగారిని రమ్మని ఫోను చేశారు. ఆయన వచ్చి పరీక్ష చేసి,

'ఏమీ ఫర్వాలేదు. చాలా మైల్డ్‌గా వచ్చింది. ఆ వయసుకి బాగానే తట్టుకున్నారు. పొద్దునకి మామూలు అయిపోతారు.' అని ధైర్యం చెప్పారు. నిద్ర పట్టడానికి ఇంజక్షన్ ఇచ్చారు. 'ఎందుకన్నా మంచిది. వాళ్ల వాళ్లకి కేబిల్ ఇవ్వండి. ఇంటికి వెళ్లిపోతే మంచిది, ఇంకెక్కడికీ తిరక్కుండా. ఎంత ఆరోగ్యవంతుడయినా, ఇటువంటి పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలి.' అన్నారు.

రాత్రంతా నిద్ర పోకుండా కూర్చున్నారు. బెంగ, భయం. ఎక్కడ్నుంచో వచ్చిన మనిషి ఇక్కడ ఏమన్నా అయితే ఎలాగ? ఉండుండి లేచి ఊపిరి ఆడుతుందో లేదో అని చూసేవారు లక్ష్మీకాంతంగారు. తెల తెల వారుతుంటే,

'మీరు పడుకోండి ఇంక. నేను కూర్చుంటాను. రోజంతా అలిసిపోయారు.' అని బలవంతంగా ఆయన్ని పడుకోనిచ్చి, గుమ్మం దగ్గరగా పడక కుర్చీ లాక్కుని కూర్చుంది. మోహన్ వచ్చి తను కూడా అక్కడే సోఫాలో పడుకున్నాడు తల్లికి తోడుగా. రాత్రంతా ఆయన లేవనే లేదు. పొద్దునే పాలవాడు రాగానే పాలు కాచి, కాఫీ కలుపుకుని తాగి నిద్ర మత్తు వదలగొట్టుకుంది మాలతి. లక్ష్మీకాంతం గార్ని లేపించి, 'ఆయన లేస్తారేమో. ఆ గదిలో కూర్చుందురు. బాత్‌రూమ్ కదీ తీసుకెళ్లాల్సి ఉంటుంది. మొహం కడుక్కుని కాఫీ తాగండి.' అంది. 'ఇంట్లో బ్రెడ్ కూడా లేదని, లేవగానే ఏమిటి ఇస్తాము ఆయనకి??'

'ఫర్వాలేదు. ముందు కొంచెం హార్లిక్స్, బిస్కట్లు ఇయ్యి. ఈలోగా షాపులు తెరుస్తారు.' అని బాత్‌రూమ్‌లోకి వెళ్లారు. పిల్లలు, ఆయనా ఒక్కసారి లేచారు. అందరూ ఆయన గదిలోనే చేరారు, కాఫీలు పుచ్చుకుని, 'ఒంట్లో ఎలా ఉందంటూ' ముసలాయన బాగానే తేరుకున్నారు ఒక్క రాత్రికే. పక్క ఇంట్లో వాళ్లు రోజూ బ్రెడ్ తింటారు. పనిపిల్లని పంపించి ఒక అరడజను ముక్కలు తెప్పించింది అవసరానికి ఉంటాయని. ఆయన రెండు ముక్కలు తిని, మిగిలినవి పిల్లలకి ఇచ్చేశాడు. ఊర్కనే హైరాన పడద్దని వారిస్తున్నా వినకుండా పిల్లలతో కబుర్లు మొదలెట్టారు.

'నిన్న రాత్రి మీకందరికీ చాలా ట్రబుల్ ఇచ్చాను. డాక్టరు ఏం ఫర్వాలేదు అన్నారు గానీ, నాకే ఒంటరిగా ఆ గదిలో ఉండటానికి భయం వేసింది. మిమ్మల్ని పిలిపించక తప్పలేదు. నిజంగా ఆఖరు సమయం వచ్చేస్తే ఒంటరిగా తట్టుకోలేనని ఎవరయినా కావాలనిపించింది. నాకు నిజంగా చావంటే భయం. అయామ్ ఎఫ్రయిడ్ ఆఫ్ గాడ్.' అన్నారు.

పిల్లలు అదేదో జోకులా తీసుకుని నవ్వారు. మాలతి పని చేసుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంటే మాటలు వినిపిస్తున్నాయి.

'ఇన్నాళ్లకి ఇండియా వచ్చారు కదా. ఏమన్నా చూసినట్టుగా అనిపిస్తోందా? అసలు జ్ఞాపకమే లేదా? ఎలా అనిపిస్తోంది' అంటూ అడుగుతున్నాడు మోహన్.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని కత్తితో కూర తరుగుతోంది మాలతి.

'ఈమధ్య ఎంతగానో వింటున్నాం మీ దేశం గురించి. టి. వి. లో కూడా చూస్తున్నాం. మీ ప్రగతి కాదు నాకు నచ్చింది. ఆధ్యాత్మిక నిలయం అంటారు కదా మీ దేశాన్ని. అదేదో చూద్దామని వచ్చాను. నా వయసెంతో తెలుసా? ఏడు దశాబ్దాలు దాటిపోయాయి. దేవుడి పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను. ఎందుకో ఒకసారి మీ దేశం చూడాలనిపించింది. ఇపుడు మా వాళ్లకి అందరికీ కూడా ఇండియా అంటే తాజ్‌మహల్ కాదు. మీ హిమాలయాలు, గంగా, దేవాలయాలు – ఇవి ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. నిజంగానే ఏదో ప్రశాంతత ఉంది ఇక్కడ. ఇంత ప్రశాంతతని మేము భరించలేమేమో అనిపిస్తోంది. ముఖ్యంగా మీ దేశపు ఆడవాళ్లు చాలా నచ్చారు నాకు. మా ఆడపిల్లలలోని విచ్చలవిడితనం కనిపించదు. గౌరవం కలుగుతుంది.

'మీరు ఇండియాలో ఉన్నప్పటి సంగతులు మీకు ఏమీ గుర్తు లేవా? అసలు ఏమీ జ్ఞాపకం లేదా? అంటోంది సుధ. నవ్వారు ఆయన.

'ఆ రోజులు, ఆ పరిస్థితులు మీకు తెలియవు. ప్రపంచం అంతా యుద్ధంలో మునిగిపోతోంది. ఒకళ్ళని ఒకళ్లం నాశనం చేసుకోడమే. నేను మిలిటరీలో పనిచేస్తుండేవాడిని. అప్పుడు మా సామ్రాజ్యం ఎంతో వ్యాపించి ఉండేదికదా. మిలటరీ పనిచేసే వాళ్లకి అసలు తీరయిన జీవితం ఉండేదికాదు. ఎక్కడికిపడితే అక్కడికి పోవడమే. ఎప్పుడో సెలవు దొరికితే ఇంటికి వెళ్లడమే. అస్తవ్యస్తంగా ఉండేవి జీవితాలు. ఆ రోజుల్లో

# జీసస్, నన్ను క్షమించు

జరిగిన ఒక సంఘటనే ఇప్పటికి నన్ను వెంటాడుతూ ఉంటుంది. ముఖ్యంగా నేను ఇక్కడికి రావడానికి అదే కారణం. ఇన్ని రోజుల్లో నాకు ధైర్యం లేకపోయింది. కానీ, ఇంకా జీవితపు ఆఖరి రోజుల్లోకి వచ్చేశాను కదా. ఇక్కడ చేసిన పాపం ఇక్కడే కడుగుకుంటే గానీ నాకు మనశ్శాంతి ఉండదేమోననిపించింది. గంగలో స్నానం చేశాను. మీకు ఆశ్చర్యంగా ఉందికదా. రోజులు దగ్గర పడుతున్నకొద్దీ నాకు దేవుడి ఎదుట నిలబడాలంటే భయంగా ఉంది. ఆ దేవుడికి సమాధానం చెప్పుకోవాలి గదా, ఎవరి నుంచి తప్పించుకున్నా.' కాస్సేపాగి ఆయన అన్నారు.

'మీకు అంతా అయోమయంగా ఉందా? ధైముందంటే చెప్తాను. మీ అందర్నీ చూస్తుంటే నాకు చాలా హాయిగా ఉంది. మీ ఫామిలీ చాలా బాగుంది.'.

'చెప్పండి' అంటూ ఇద్దరూ బలవంతం వేశారు.

'మనిషన్నాక ఎన్నో పాపాలు చేస్తాము. కానీ తెలిసో, తెలియకో చేసిన మన పాపం ఇంకా వాళ్ల జీవితాన్ని నాశనం చేస్తే అది ఘోరం. దేవుడు తప్పకుండా శిక్షిస్తాడు. ఆ శిక్షకే నేను భయపడుతుంట. రెండో ప్రపంచం యుద్ధం రోజులు. నేను ఒక ఆయుధాలు చేరవేసే షిప్ మీద దేశాలు తిరుగుతున్నాను. ఇంకా చాలామందితో కలిసి. అలాగే మీ దేశం వచ్చాను. ఏదో ఊళ్లో ఆగాము. మాకేమీ పట్టేదిగాదు. ఎక్కడయినా ఒకటే పని.ఊళ్లోకి వెళ్లడం తాగి, తందనాలాడటం. మళ్ళీఏ రాత్రో లేకపోతే మర్నాడు పొద్దునో షిప్‌కి చేరడం. ఆ ఊళ్లో పని అయ్యేదాకా ఇదే దినచర్య. అలా జరిగిపోయేవి రోజులు. మా తల్లిదండ్రులు కూడా ఎక్కడున్నారో పట్టేదిగాదు. ఒక రకమైన పాపపు జీవితం గడిపేవాళ్లం. అదే నన్ని వయసులో తరుముతోంది.

ఆ రోజు మా షిప్ చూడడానికి ఒక మిషనరీ లేడీ తన స్కూలు పిల్లలని తీసుకుని వచ్చింది. ఆవిడ దగ్గర బంధువు ఒకతను మాతో పనిచేస్తున్నాడు. కొంత భాగం చూపించమంటూ. నాకు అప్పజెప్పాడు. మామూలుగానే నేను వాళ్లతో కలిసి తిరుగుతున్నాను. కానీ అనుకోకుండా నా దృష్టి చెప్పుతున్నదంతా కన్నార్పకుండా వింటూన్న ఒక అమ్మాయి మీద పడింది. ఎపుడూ ఆడవాళ్లతో అల్లరిచిల్లరిగా ఆడుకోడమేగాని తేరిపార చూడడమన్నది లేదు. నా వయసుకూడా తక్కువేమీగాదు అసలే మా దేశంలో జీవిత విధానం విచ్చలవిడి. అందులో మిలటరి జీవితం మరి చెప్పక్కర్లేదు. అటువంటిది ఆ అమ్మాయి చూస్తుంటే ఏమిటో అనిపించింది. మామూలుగా కలిగే వికారంకాదది. ఏదో విచిత్రమైన భావన. సాధ్యమైనంతగా ఆ అమ్మాయికి దగ్గరగా నిలబడటం మొదలుపెట్టాను. ఇది ఏదో దేశం, ఎవరో అమ్మాయి, తనకీ వాళ్లకీ, పొసగదు అన్న ఆలోచనే రాలేదు. ఆ క్షణంలో ఆ అమ్మాయి నా కళ్ల ముందు నుంచి జారిపోతే నా జీవితమే లేదనిపించింది. పిచ్చిగా ఆ అమ్మాయి వెనకాతలే తిరిగాను. కొంతసేపటికి వాళ్ళు ఖంగారుపడ్డారు. కాంటిన్‌లోకి తీసుకెళ్లి టీ, కేకులకి ఆర్డరిచ్చాను. సాధ్యమైనంతసేపు ఆ అమ్మాయితో ఉండాలని, చీకటిపడిపోతోంది. అంటూ నాతోటిఅతను కనిపించగానే అందరూ పారిపోయినట్టే వెళ్లిపోయారు. వాళ్ల ఖంగారు తెలుస్తోంది. ఆ అమ్మాయిని ఆపాలని ఉంది. ఎలాగో తెలియలేదు.


ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. మర్నాడుపొద్దునకి విషయం మర్చిపోదామనుకున్నాను గానీ మరింతగా బలపడిపోయింది. ఎందుకలా అనిపించిందో నాకే తెలియదు. నా గోల చూసి తోటి వాళ్లందరూ నవ్వడం మొదలెట్టారు. 'పెళ్లి చేసుకుంటావేమిటి' అంటూ. రెండో రోజున ఆ స్కూలు ఎక్కడ ఉందో కనుక్కొని నేనే అక్కడికి వెళ్లాను. మొండిగా. ఆ రోజున అంత ధైర్యంఎలా వచ్చిందో ఇప్పటికి ఆశ్చర్యంవేస్తుంది. ఆ అమ్మాయి ఎందుకంతగా ఆకర్షించిందో తెలియదు.


ఆ ప్రిన్సిపాల్ నెమ్మదిగా 'ఇది ఆడపిల్లలకని తెరచిన స్కూలు.మనదేశంకాదు. ఎవర్నిపడితే వాళ్లని తీసుకుపోవడానికి. మర్యాదస్థుల సంఘం. ఎప్పుడూ బయటికి పంపని ఆడపిల్లలని మా మీద నమ్మకంతో పంపిస్తున్నారు.' అంటూ నచ్చచెప్పింది. నాతో తగవు పెట్టుకుంటే లాభం లేదని సాత్వికంగా మాట్లాడింది.

మళ్లీ వెళ్లాను రెండు రోజుల తర్వాత. ఈసారి ఎంతో బతిమాలుకుని 'వాళ్ల పేరెంట్స్‌ని కలుస్తానని, ఆ అమ్మాయిని అందరి అనుమతితో పెళ్లి చేసుకుంటానని, ఈ ఉద్యోగం వదిలేసి మంచివాడిగా స్థిరపడతానని బతిమాలుకున్నాను. ఎవరూ నమ్మరు ఆ మాటలు. ఆవిడ ఎంతో ఇదిగా 'ఇది జరిగే పనిగాదు. నీ వయసెంత. ఆ పిల్ల వయసెంత? ఎక్కడి నుంచి వచ్చిన వాడివి నువ్వు? ఎంత మంచి వాడివయినా నీకివ్వరు. కొంచెం తెలివి తెచ్చు కుని ఆలోచించుకో.' అంటూ ఆ అమ్మాయిని నాకు కనిపించకుండా చేసింది. పిచ్చివాడిలా రోడ్లన్నీ తిరిగాను. ఎక్కడన్నా కనిపిస్తుందేమోనని. నిజంగా నాలో కపటంలేదు. ఇంకా జీవించడం దుర్భరం అనిపించింది. ఆ ప్రిన్సిపాల్ మీద జాగా పిచ్చి కోపంగా ఉండేది, నాకు కాకుండా చేసిందని. అంతా నాపరంగానే ఆలోచించేవాడిని. అంతవరకూ అవతల వాళ్ళు నా మూలంగా ఏం బాధపడ్డారో అన్న ఆలోచనే రాలేదు.

కొన్ని రోజుల తర్వాత ఆ ప్రిన్సిపాల్ ఒక ఫాదర్‌తో ఏదో పని మీద మా షిప్ మీదకి వచ్చింది.నా వాలకం చూసింది.నన్ను దగ్గరకు కూర్చోబెట్టుకుని,

'నీ వైపు నుంచి ఆలోచిస్తున్నావే గానీ లేత వయసులో ఉన్న ఆ పిల్ల జీవితాన్ని, కలల్ని ఎలా నాశనం చేశావో నీకసలు ధ్యాస ఉందా? ఆడపిల్లలు చదవుకోడమే తక్కువ ఇక్కడ. అలాంటిది తెలివితేటలుగా చదువుతోంది. నీ మూలంగా ఆ అమ్మాయి అన్నీ వదులుకుని భయపడి పారిపోయింది. ఎన్నో రోజుల నుంచి ఇక్కడ ఉంటున్నాము. ఈ సంఘం పరిస్థితులు తెలిస్తే ఇలా ఉండవు నువ్వు. మీద చెయ్యి వెయ్యడం కాదు కదా, ఎవడయినా వెకిలిగా ఆడపిల్ల వైపు చూస్తేనే ఆ పిల్ల పేరు పాడయి పోతుంది. అలాంటి సమాజం ఇది. అందులో ఎక్కడి వాడివో నువ్వు వచ్చి ఆ అమ్మాయి వెనకాతల పడ్డావని నలుగురికీ తెలిస్తే ఆ పిల్ల, తల్లిదండ్రులు కూడా ఆత్మహత్య చేసుకోవాల్సిందే తప్ప ఎవరూ ఆ అమ్మాయిని చేసుకోరు. మర్యాదగా బతకనివ్వరు. నీతోటి ఎలా పంపిస్తావనుకున్నావు? నీ జీవితం ఏమిటి? ఎంత పాపపు బ్రతుకు గడుపుతున్నావో తెలుసా? దేవుడికి భయపడు ఏదో ఒక రోజు ఈ పాపానికి దేవుడి ఎదుట సమాధానం చెప్పుకోవాలి.






తప్పించుకోలేవు. తన బిడ్డల్ని ఎవరయినా హింసిస్తే, దుఃఖపెడితే దేవుడు మన్నించడు. నిన్ను శపిస్తాడు. ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని జీవితాన్ని మార్చుకో' అంటూ ఫాదర్ చేత నాకు దైవోపదేశం చేయించింది.

అంతే ఆ రోజుతో నా జీవితం పూర్తిగా మారిపోయింది. నేనెంత తప్పు చేశానో తెలిసింది. తిరిగివచ్చి కొత్త జీవితం ప్రారంభించాను. తెలిసి తెలిసి ఎవర్నీ బాధపెట్టలేదు. ఏదో ఒకమంచి పనిచేసి నా పాపాన్ని కడుక్కోవాలనే ప్రయత్నం. అయినా నాకు మనశ్శాంతి లేదు. అందులో ఈ చివరి రోజుల్లో, దేవుని పిలుపు కోసం ఎదురు చూస్తున్న

## జీసస్, నన్ను క్షమించు

నేను విపరీతంగా భయపడుతున్నాను. చావంటే భయంగా ఉంది. దేవుని ముందు నిలబడాలని. ఆ అమ్మాయి నిజంగా నా బాధపడలేక ఆత్మహత్య చేసుకుందా? పగలూ రాత్రీ ఇదే ప్రశ్న అందుకనే మీ దేశం వచ్చాను. ఇక్కడ తిరిగితే ఏమన్నా మనశ్శాంతి దొరుకుతుందేమోనని.

నిత్యమూ ఒకటే ప్రార్థన. జీసస్, నన్ను క్షమించు' అంటూ ఆగారు.

యధాలాపంగా వింటున్న మాలతి కొయ్యబారిపోయింది. చెవుల్లోంచి ఆవిరి వచ్చినట్లయింది.

'ఊర్కోండి అంకుల్ ఎందుకంత భయపడతారు? మనచేత తప్పులు చేయించేది దేవుడే. మళ్లీ శిక్షించేది దేవుడే. అదెలా కుదురుతుంది?' అంటున్నాడు మోహన్.

'అదే తప్పు. దేవుడి సృష్టి అంతటిలోకి మనిషి జన్మ అపురూపమైనది. ఎందుకంటే, మనకి మెదడు ఇచ్చాడు. ఆలోచనాశక్తి ఇచ్చాడు. అటువంటప్పుడు కూడా తప్పులు చేస్తే ఎందుకు క్షమించాలి?'

'ఇదిగో మళ్లీ ఇదొక టాపిక్ తీసుకొచ్చారా' ఆయన్ని ఇంక మాట్లాడించకండి. అసలే ఒంట్లో బాగులేని మనిషి. మరి ఆవేశపడుతున్నారు. ఎప్పుడో అయిపోయినవన్నీ జ్ఞాపకం చేస్తూను' అని పిల్లల్ని మందలించి బయటకి తీసుకొచ్చారు లక్ష్మీకాంతంగారు మాలతి గబుక్కున వంటింట్లోకి తప్పుకుంది. పొద్దున్నే శాంతి వచ్చింది వాళ్ల నాన్నగారితో మళ్లీ ఒక ఇంజక్షన్ చేసి, మందులు వేసుకోమని చెప్పి వెళ్లిపోతుంటే,

'సాధ్యమైనంతవరకూ దేవుడి దగ్గరకి చేరే ప్రయత్నాన్ని వాయిదా వేయిస్తుంటారు మీ డాక్టర్లు' అన్నారు నవ్వుతూ ముసలాయన

'అలా అనకండి ఇది కూడా దేవుడి చేతుల్లోదే ఆయన రమ్మంటే మేము ఎంత ప్రయత్నించినా ఆపగలమా? కాకపోతే మందులతో ఎక్కువ బాధపడుతూ ఉండకుండా ఉపశమనం కలిగిస్తాం అంతే అన్నారు డాక్టరుగారు నవ్వుతూనే

ఆఫీసుకి వెళుతూ 'చూడు మాలతీ ఆయన మళ్లీ పడుకున్నారు. నాకు బొంబాయి నుంచి వచ్చిన కొంతమందితో మాట్లాడే పని ఉంది ఆఫీసులో వాళ్లు ఇవాళ వెళ్లిపోతున్నారు. తొందరగా వచ్చేస్తాను. వాళ్ల అబ్బాయికి కూడా తెలియపర్చాలి గదా. ఏం చెయ్యమంటాడో' పనివాళ్లని గుమ్మం దగ్గర కూర్చోమను లేస్తే చెపుతుంది లేచి తిరుగుతున్నారు గదా ఆయన పనులు ఆయన చేసుకోగలరు. కొంచెం మందులు వేసుకున్నారో లేదో గుర్తు చెయ్యి. నీకు భాష ప్రాబ్లమ్ కాదు కదా మళ్లీ హార్లిక్స్, బ్రెడ్ ఇయ్యి పెద్దాయన ప్రగా తిరుగు ఫర్వాలేదు సుధ తొందరగా వచ్చేస్తానంది' అని. 'అదేమిట మొహం అలా ఉంది' రాత్రంతా


**తెల్ల వెంట్రుకలు నల్లపర్చును**

మేము యెక్కువగా ప్రశంశించదలచలేదు. మా ఆయుర్వేదక తైలము తెల్ల వెంట్రుకలను కుదుళ్లనుంచి నల్లబర్చి, తెల్లవెంట్రుకలు రాకుండా అరికట్టును. మెదడుకు, కళ్లకు పుష్టిని కలిగించును. మందు గుణం ముందు ధర ఆలోచించదగినది కాదు. పూర్తి కోర్సుకు, పోస్టేజి, ప్యాకింగ్ ఖర్చులు లేకుండా రు. 41/- మీ అడ్రసు ఇంగ్లీషులోనే వ్రాయండి.

**SUNITA AYURVED BHAVEN,**
P.O.-LALBIGHA (GAYA) [A.D.]

నిద్ర లేదు కదా. భయపడిపోయావేమిటి? నేనూ అంతేలే. ఏమన్నా అయితే ఏం చెయ్యగలం?' అంటూ వెళ్ళిపోయారు శ్రీకాంతంగారు.

అమ్మగారు ఆ బాబుగారు లేచారండి' అంటూ పరిగెత్తుకొచ్చింది పనిపిల్ల. పనంతా చేసుకొని పేపరు చూస్తోంది మాలతి. ఇపుడు మనసు ప్రశాంతంగా ఉంది ఆవిడకి కొన్ని గంటల సముదాయింపుతో.

'అక్కడే నిలబడి ఉండు వస్తున్నాను', అని గబగబా హార్లిక్స్ కలిపి, బ్రెడ్ టోస్ట్ చేసి పట్టుకెళ్ళింది. కర్టెన్ తీసుకొని ట్రేతో లో పలికి వస్తూ.

'ఎలా ఉంది? ఇపుడు మీకు బాగుందా?' అంది నవ్వుతూ.



'చాలా బాగుంది. మీకందరికీ చాలా ట్రబుల్ ఇచ్చాను. అదే బాధగా ఉంది'.

'ఏమీ ఫర్వాలేదు. మీ పిల్లలయితే చెయ్యరా అలాగే. మాదేశం చూడ్డానికి ఎంతో అభిమానంగా వచ్చారు. మీ బాధ్యత మాదికదా.'

'హార్ట్ ఎటాక్ నుంచి కోలుకుంటున్న మనిషి తను చెప్పే విషయం విని తట్టుకోగలడా? అలాకాక దానివల్ల అతని హృదయం తేలికపడి తొందరగా కోలుకుంటాడేమో' . అతని కేసే చూస్తూ ఆలోచిస్తోంది. ఏదో నిర్ణయించుకున్నట్టు లేచి బయటకి వెళ్ళి, పాత ఆల్బమ్ ఒకటి తెచ్చింది.

'ఏమిటి? ఆల్బమ్ . మీ ఫోటోలన్నీ ఉన్నాయా? మీది ఒక స్వీట్‌హోమ్ మైచైల్డ్. నీ పిల్లలు , నీ భర్త నీ వెనకాతలే ఎంతలా తిరుగుతారు? పొద్దున లేచిన దగ్గర నుంచీ నీ మీద ఎంతగా ఆధారపడతారు? యు ఆర్ ది సెంట్రల్ ఫిగర్. నీ చుట్టూ నీ ఇల్లు తిరుగుతోంది. చూడ్డానికి చాలా హాయిగా ఉంది. ఒక నిజమైన భారత స్త్రీ రూపాన్ని చూస్తున్నాను.' అంటూ ఆల్బమ్ అందుకోబోయాడు.

'ఈ ఫోటోలో అమ్మాయిని గుర్తు పట్టగలరా 'గొంతు పెగుల్చుకుని అడిగింది. మాలతి. దడదడ కొట్టకుంటున్న గుండె చప్పుడు గొంతులోకి వినిపిస్తోంది. స్కూలు యూనిఫారమ్‌తో తియించుకున్న ఫోటో అది. ఆయన దగ్గరగా పెట్టుకుని చూసి,

'ఈ అమ్మాయి..... ' అంటూ అర్థోక్తిలో ఆగిపోయి తన వైపు చూశారు. మళ్ళీ ఫోటో చూసి తల ఎత్తిన మనిషి ఎత్తినట్టే ఉండిపోయారు. ఏదో వెదుకుతున్నట్టుగా ఆగిపోయారు.

'ఈ అమ్మాయి నువ్వేనా? అవును కదూ' అన్నాడు ఏదో లోకం లోంచి మాట్లాడుతున్నట్టుగా. 'నేను చెప్పినదంతా విన్నారా?'

'అవునన్నట్టు తల వూపింది.' ఆ అమ్మాయిని నేనే. ఇన్నాళ్ళ తర్వాత ఇలా మొహం కూడా గుర్తు లేని ఆ మనిషి ఇలా తారస పడతారనుకోలేదు. ఆ రోజు నా వెనక పడి నా జీవితమే మార్చేశారు. కాళ్ళు చేతులు వణుకుతూ, చెమటలు కార్చుకుంటూ బయట పడ్డాను అక్కడ నుంచి. ఏదో అయిపోయిందను కుంటే రెండు రోజుల తర్వాత మళ్ళీ వచ్చారు. నన్ను స్టాఫ్ బాత్‌రూమ్‌లో దాచారు ఎవరికీ కనిపించకుండా. నాన్న గారిని పిలిపించారు. ప్రిన్సిపాల్ నెమ్మదిగా విషయం వివరించారు. స్కూల్లో పిల్లలకి కూడా తెలియనివ్వ లేదు నేను. అనవసరంగా విషయం బయటకి పోతుందని. ఈ మనుష్యులు చాలా ప్రమాదకరమైన వాళ్ళు, ఊరంతా తిరుగుతున్నారు. వాళ్ళలో ఎవరు మీ అమ్మాయిని చూసినా ప్రమాదమే. ఎక్కడికన్నా

పంపే ప్రయత్నం చెయ్యండి. ఇదంతా నావల్ల కూడా జరిగింది. చాలా బాధపడుతున్నాను. తెలివైన పిల్ల. కానీ జీవితం ముఖ్యం కదా. ఆలస్యం లేకుండా ఏదో ఒకటి చెయ్యండి.

నాన్నగారికి ఇది ఒక షాక్. ఇలాంటిది కూడా జరుగుతుందన్న ఆలోచనే లేదు. అంత మనిషి డీలా పడిపోయారు. తన హోదా అదీ ఈ సమయంలో పనికి రాదని గ్రహించుకున్నారు. ఏం చేసినా మరింతగా అందరి నోళ్లల్లో పడతారు. నేనయితే బెదిరిపోయాను. ఉన్నపళంగా నన్ను వూరు నుంచి తీసుకెళ్లి పోయారు. చాలా రోజులు రాత్రిళ్లు నిద్రపట్టలేదు. కళ్లు మూసుకుంటే ఎవరో ఎత్తుకు పోతారనే భయం. ఆవిడ అన్నట్టుగా ఈ విషయం ఏమాత్రం బయటకి వచ్చినా మాకు ఆత్మహత్యే శరణ్యం అయ్యేది. అందులో ఒక తెల్లవాడు ఊర్కే వెనక పడ్డాడంటే ఎవరూ ఊర్కోరు. ఏదో చేసే ఉంటాడు అంటారు.' తనలో తనే అనుకున్నట్టుగా చెప్పుకు పోతోంది మాలతి.

'ఇప్పటికీ నిద్దట్లో భయపడుతుంటాను. ఉదయం మీరా విషయం చెపుతుంటే నాలో చలనం ఆగిపోయింది. ఎప్పుడన్నా అనుకున్నారా? ఇలా ఎక్కడి వాళ్లమో కలుస్తామని. ఏదో మామూలు సంఘటనలా చెప్పి ఉంటే నేనూ విని ఊర్కునే దాన్ని. ఇప్పటి ఈ గౌరవం ఉండేది కాదేమో. కానీ ఆఖరులో మీరు అన్న మాటలు నన్ను కదిలించాయి. ఆ రోజుల మాయమయిన అమ్మాయి

# జీసస్ నన్ను క్షమించు.

ఏమయిపోయిందో అని మీరు మథన పడుతుంటే ఊర్కోలేక పోయాను. పెళ్లయిన కొన్ని రోజులకే నేను ఆ బాధ మర్చిపోయాను. ఆ తర్వాత పిల్లలతో నా కలలన్నీ తీర్చుకోగలిగాను. అందుకని నేనెక్కువగా పోగొట్టుకున్నది లేదు. కొన్ని రోజులు పడ్డ మనస్తాపం తప్ప. మీరు నిశ్చింతగా గడపండి ఈ రోజులు. మీదేవుడైనా, మా దేవుడైనా తెలిసి తెలిసి అవతల మనిషిని బాధపెడితే క్షమించడు. అందుకనే ఇలా ధైర్యం చేసి మీతో ఇదంతా చెప్తున్నాను. ఏ దేవుడి ముందు తలవంచవలసిన అవసరం మీకు లేదు ఎందుకంటే ఇన్ని రోజులూ మీరు పడ్డ క్షోభే మీకు పెద్ద శిక్ష' అంటూ తేలికపడ్డ హృదయంతో ఆగింది.

ముసలాయన మొహం ఆనందంతో వెలిగింది. ముందురాత్రి రోగ లక్షణాలు కూడా ఏమీ కనిపించలేదు.

'గాడ్ ఈజ్ గ్రేట్ చైల్డ్! నిన్న రాత్రి నా బాధకి దేవుడు నన్ను శిక్షిస్తున్నాడనుకున్నాను గానీ, నాకు విముక్తి కలిగిస్తున్నాడనుకోలేదు. ఆ పరిస్థితే రాకపోతే నేను మీ యింట్లో ఉండను, ఆ ప్రస్తావనే రాకపోను. చాలు. ఆ దేవుడి కన్న ముందు నువ్వు నన్ను క్షమించావు. నాకెంతో తేలిగ్గా ఉంది. ఇన్నాళ్లు ఎంత నరకం అనుభవించానో నీకు తెలియదు. ఈ శిక్ష ఇంక చాలనుకున్నాడు దేవుడు. అందుకనే నాకు మీ దేశం రావాలన్న కోరిక కలిగించాడు.' అని ఉద్వేగంతో ఆగి,

'అవునూ. నేను చెప్తున్నపుడు నీ భర్త ఏమీ అనలేదే? అతనికి ఈ విషయం తెలియదా? ఇన్నాళ్లయినా చెప్పలేదా' నమ్మలేనట్టుగా అన్నాడు.

పేలవంగా నవ్వింది మాలతి.

'ఈ దేశంలో భార్య విషయంలో భర్త చాలా స్వార్థపరుడు. మనసా, వాచా ఆమె పూర్తిగా తనదే అయి ఉండాలి. ఒక విధంగా మా దేశంలో ఈ కుటుంబ వ్యవస్థ, భార్యాభర్తల అనుబంధం ఇంకా మిగలడానికి ఇదీ ఒక కారణమే. బయట ఎన్ని తిరిగినా ఆఖరికి తన దగ్గరకే వస్తాడనే నమ్మకంతో ఈ దేశపు భార్య అలా ఎదురు చూస్తూనే ఉంటుంది. కొన్ని దశాబ్దాల కిందట అయినా సరే ఎవరో వ్యక్తి తన భార్యని కూడని దృష్టితో చూశాడని తెలిసి ఇపుడు కూడా ఆయన భరించలేరు. ఎప్పటికీ ఈ విషయం చెప్పవద్దని నాన్నగారు నాదగ్గర నుంచి మాట తీసుకున్నారు. అర్థం చేసుకుంటే కలిగే తృప్తి కన్న, అపార్థం చేసుకోవడం వల్ల వచ్చే నష్టమే ఎక్కువ. ఇంతేనా, ఇంకా ఏమన్నా జరిగిందా అన్న అనుమానం జీవితాంతం పీడిస్తుంది. అది ఎటువంటి పరిణామాలకన్నా దారి తీయవచ్చు. ఇంక ఇపుడు చెప్పే ప్రశ్నే లేదు. మీ నోటమ్మట ఆ నాటి భావాలు విన్నాక తల పండి పోయిన ఈ వయసులో కూడా ఆయన భరించలేరు. ఆయనకు





uday

TOOTH BRUSH
SHAVING BRUSH

DESIGNED FOR PERFECT AND COMFORTABLE BRUSHING WITH NYLON '66' BRISTLES

SOUTHERN BRISTLERS P. LTD.,
31-32, GREEN VIEW COLONY
MUGAPPIER ROAD, PADI
MADRAS-600 050
Phone : 653476, 443518

తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

SHYAM AYURVED BHAVAN (AP)
P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105

నా దగ్గర రహస్యాలు లేవు. అందుకనే అప్పుడప్పుడు నేను చాలా బాధపడుతుంటాను- ఆయన లోని నిర్మలత్వం నాలో లేదని. ఏం చెయ్యను? విషయం తెలిసిన అమ్మానాన్న, ఆ ప్రిన్సిపాల్ లేనేలేరు. నేను చెప్పే ప్రసక్తే లేదు'. అంటూంటే మధ్యలో అందుకొని.

'డోన్ట్ వర్రీ చైల్డ్. బి ఎస్యూర్డ్. నీ భావనలు అర్థం చేసుకున్నాను. ఈ రహస్యం నాతోనే చచ్చిపోతుంది. ఈ రాజు నుంచీ జీసస్ , నన్ను క్షమించు అంటూ భయపడే రోజులు పోయాయి. నువ్వు, భర్త, నీ పిల్లలు ఇలాగే సుఖంగా ఉండాలని ఆ దేవదేవుని ప్రార్థిస్తాను నాకు పిలుపు వచ్చేదాకా. అన్నారు.

'మీరు విశ్రాంతి తీసుకోండి. ఈ రోజంతా చాలా ఉద్వేగ పడ్డారు.' అంటూ లేచింది. ఆయన చేతిలోకి క్రాస్ తీసుకుని. బాగ్ లోంచి బైబిల్ తీసుకుని,

'నిర్మలమైన మనసుతో భగవద్ధ్యానం చేసుకుంటాను కొంతసేపు' అని చదువుకోసాగారు.

ఆ తర్వాత ఆయన కొడుకు ఫోనులో మాట్లాడి తన స్నేహితుడొకరు ఢిల్లీ హైకమిషన్‌లో ఉన్నాడని, అతని కుటుంబంతో తన తండ్రిని పంపించి వెయ్యమని చెప్తే, మోహన్ ఆయన కోరిక మీద రైలులో ఢిల్లీ తీసుకెళ్ళి దిగబెట్టాడు. ఇంటికి చేరాక ముసలాయన కృతజ్ఞతలతో ఉత్తరం కూడా రాశారు.

* * *

ఆరు నెలలు ఇట్టే జరిగిపోయాయి. లక్ష్మీకాంతం గారు, మాలతి కొడుకు పెళ్ళి ముహూర్తాలు పెట్టుకున్నారు. ఆ హడావుడిలో రోజులు సరదాగా గడిచి పోతున్నాయి. వియ్యపు రాళ్ళు ఇద్దరూ కలిసి షాపింగ్‌లు చేస్తున్నారు.

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన లక్ష్మీకాంతం గారికి, ఆ రోజు తను నగల కొట్టుకి వెళ్ళి సెలక్టు చేసిన డిజైన్ల వివరాలు ఉత్సాహంగా చెప్తోంది మాలతి.

'కొత్త మోడల్ తెండి. సింపుల్‌గా ఉంది. శాంతి ఎలాగూ. ఎక్కువ బంగారం పెట్టదు, తేలిగ్గా ఉన్నవి చూడమంది కదా. తనకి నచ్చింది. గాజులకి కూడా చెప్పేశాను. సరళకి కూడా ఏడో నెల గాజులు పెట్టించి నపుడు ఇవ్వచ్చుని, ఇంకో జత కూడా చెప్పాను' ఆయన తన మాటలు సరిగ్గా వినడం లేదని గ్రహించి ఆగిపోయింది.

'ఏమిటి అలా ఉన్నారు? ఒంట్లో బాగు లేదా?'

'ఏమీ లేదు . ఇవాళొక ఉత్తరం వచ్చింది. మన ఇంటికి వచ్చిన ముసలాయన గుర్తున్నారా? పోయారట. కొడుకు రాశాడు.' అప్రయత్నంగా మాలతి కళ్ళు చెమర్చాయి. తను సుఖంగా ఉందని తెలిసి, వెలిగిన ఆ మొహమే కళ్ళముందు నిలబడింది.

'పోనీ మిగిలిన రోజులన్నీ హాయిగా గడిపారట. చాలా పీస్‌ఫుల్‌గా పోయారట. మీ దేశంలో ప్రశాంతత పొందుతానని అంటే ఏదో పంపించాను గానీ దాన్లో ఇంత నిజముందనుకో లేదు. అక్కడి నుంచి వచ్చాక చాలా మారిపోయారు. ఎప్పుడూ టెన్షన్‌తో కుంచించుకు పోయి చావంటే భయపడి పోయే మనిషి అంత ఉత్సాహంగా ఎలా తయారయ్యారు. ఆ రహస్యం ఇప్పటికీ అర్థం అవడం లేదు. మీ దేశంలో నిజంగానే ఏదో ఉంది. నేనూ ఫామిలీతో ఒకసారి వస్తాను అంటూ రాశారు. పోనీలే. ఆ రోజుల్లో ఆయనకి ఒంట్లో బాగులేక పోతే ఎంత భయపడ్డాము. దేశం కాని దేశంలో ఏమయిపోతాడో అని. ఏమిటో పరిచయం కొంచెమే అయినా ఈ వార్త వింటే మనసు ఏమిటోలా అయిపోయింది. తను కావాలనుకున్న తృప్తి ఏదో పొందే వెళ్ళాడు ఇక్కడనుంచి. అదే చాలు. అవును, ఏదో చెప్తున్నావు ఇందాక, సరిగ్గా వినలేదు'.

'తర్వాత చెప్తాను లెండి. కాఫీ చల్లారిపోయింది. మళ్ళీ తెస్తాను' అంటూ వంటింట్లోకి వెళ్ళి పోయింది. ఆమె మనసంతా ఉత్తరంలోని మాటల మీదే ఉంది.

'నిజమే . ఆ రహస్యం ఎవరికి తెలియదు. అది ఆయనతోనే చచ్చిపోయింది. నాతో పూర్తిగా సమాధి అయిపోతుంది.' అని నిట్టూర్చింది.

(అయిపోయింది)

# ఈ వేమన పద్యాలు




సంద్రమునకు జూడ సరియేదియును లేదు
అట్టి జలధినీరు ననువుగాదు
అనువుగాని నీరు యదియేమి చేయను
విశ్వదాభిరామ వినురవేమ